క్లుప్తంగా

ఉత్తర వాహినిలో భక్తుల పుణ్యస్నానాలు



పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీ పెదకళ్లేపల్లిలో కృష్ణానది జనసంద్రంగా మారింది. మహాశివ రాత్రి సందర్భంగా శనివారం ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చారు. కృష్ణానది మూడు ఘాట్‌లు భక్తులతో నిండిపోయాయి. స్నానాలు చేసిన భక్తులు నది ఒడ్డున శివలింగం, ద్వాదశ జ్యోతిర్లింగ సహిత సహస్ర లింగేశ్వరస్వామి, అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. నది ఒడ్డున పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తున్న వారసులు, మరోపక్క పసుపు, కుంకుమలు, పూలు, పండ్లు, బియ్యంతో కూడిన చాట్లను ముత్తైదులకు వాయినాలు అందిస్తున్న మహిళలు, గంగిరెద్దుల సవ్వడులు, జంగమదేవరలు శంఖు నాద స్వరంతో దక్షిణకాశీ నందడిగా మారింది. దుర్గా నాగేశ్వరస్వామివారి ఆలయం నుంచి కృష్ణానది వరకు రెండు కిలోమీటర్ల మేరకు రహదారి పొడవునా భక్తులతో నిండిపోయింది. అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో సీఐ జి. శ్రీనివాస్ 500 మంది పోలీసులతో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ కె. నవీన్ కుమార్, పంచాయతీ అధికారులు, మత్స్యశాఖ, అగ్నిమాపక సిబ్బంది సేవలు అందించారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివ రాత్రి నేపథ్యంలో పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీ కొనసాగగా, మధ్యాహ్నం మహా నివేదన అనంతరం మరింత భక్తుల రద్దీ పెరిగింది. కళాశాలలకు వరస సెలవుల కావడంతో విద్యార్థులు స్నేహితులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహా శివరాత్రి నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఆలయ ప్రాంగణంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు మల్లేశ్వరాలయం, మహా మండపం, ఘాట్‌రోడ్డు, కనకదుర్గనగర్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయాన్ని శనివారం ఆలయ అర్చకులు తెరిచి పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధి పనులు జరుగుతున్న సంగతి విదితమే. పనుల నిమిత్తం స్వామి వారి ఆలయాన్ని కొన్ని నెలలుగా మూసివేయగా, మహా శివరాత్రి నేపథ్యంలో ఆలయ ద్వారాలు తెరిచి స్వామి వారికి పూజా కార్యక్రమాలను నిర్వహించిన పిమ్మట భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని బాలాలయంలో స్వామి వారికి త్రికాల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

వేలాదిగా కోటప్పకొండకు తరలిన భక్తులు



అన్నదానం నిర్వహిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని



అన్నదానం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్

పార్టీలు, స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు సేవలు

చిలకలూరిపేట: హరహర మహాదేవ... శంభో శంకర... చేదుకో కోటయ్య... మమ్మాదుకో కోటయ్య... అంటూ చిలకలూరిపేట పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కోటప్పకొండ తిరునాళ్ళకు శనివారం తరలివెళ్ళారు. ప్రభలు కట్టుకుని కోటివేల్పుల అండ కోటప్పకొండకు బారులు తీరారు. చెరుకుగడలు, మిఠాయిల ఘుమఘుమల మధ్య కొండదేవర జాతరకు కదలివెళ్ళారు. మధ్యాహ్నం నుంచి కొండకు వెళ్ళే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. భక్తులు కొండకు వెళ్ళేందుకు ఆర్టీసీ సంస్థ తరపున 120 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అడ్డరోడ్డు సెంటర్ నుంచి కొండకు వెళ్ళేందుకు ఒక మార్గం, తిరిగి వచ్చేటపుడు యూటీ సెంటర్ నుంచి కట్టుబడివారిపాలెం మీదుగా మరో మార్గం ఏర్పాటు చేశారు. అడ్డరోడ్డు సెంటర్‌లో ఆర్టీసీ ప్రత్యేక సమాచార కేంద్రాన్ని ఏర్పరిచారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బుకింగ్ కౌంటర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు.



చౌత్రా సెంటర్ శివాలయంలో మూల విరాట్

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో....

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటప్ప కొండకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో అల్పాహార కేంద్రంతో పాటు, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమానికి ముందు దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు.

కిటకిటలాడిన శివాలయాలు...

మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కళామందిర్ సెంటర్‌లోని గంగా బాలా త్రిపుర సుందరి సమేత నాగేశ్వరస్వామి ఆలయం, చౌత్రాసెంటర్‌లోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. మండలంలోని యడవల్లి, గోవిందపురం, లింగంగుంట్ల, మురికిపూడి, పసుమర్రు, వేలూరు గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఆవుపాలు, నెయ్యి, విభూది, గంధనం, బిల్వార్చనలు చేశారు. వేదపండితులు భక్తుల గోత్రనామాలతో పూజించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్ళలో చెరుకు గడల విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వివిధ రకాల మిఠాయిలతో స్వీట్ షాపులు కళకళలాడాయి. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో తిరునాళ్ళ సందర్భంగా పిల్లల ఆట వస్తువుల విక్రయ స్టాళ్ళు ఏర్పాటయ్యాయి.

స్వచ్ఛంద సంస్థల చేయూత...

కోటప్పకొండకు తరలివెళ్ళే భక్తులకు రాజకీయ పార్టీలు, పలు స్వచ్ఛంద సంస్థలు, మిత్ర బృందాల ఆధ్వర్యంలో సేవలందించారు. వివిధ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కొండకు వెళ్ళేమార్గంలో అల్పాహార కేంద్రాలతో పాటు మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. రోటరీక్లబ్, లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ముదిరాజ్ యువసేన, కాపు, బలిజ, తెలగ, ఒంటరి సేవా సంఘం, మల్లెల రాజేష్ ఫౌండేషన్, సీపీటీ సోల్జర్స్, శాలివాహన సంఘం, ఆరా ఫౌండేషన్, రజకజన సేవా సంఘం ఇలా పలు సంఘాల ఆధ్వర్యంలో అల్పాహారం, చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేశారు.

బాలకోటయ్యకు మంత్రి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలను తీసుకు వస్తున్న మంత్రి నాగార్జున

చుండూరు(భట్టిప్రోలు): చుండూరులో కొలువైన శ్రీ బాలా త్రిపుర సుందరి బాల కోటేశ్వరస్వామి దేవాలయాన్ని శనివారం మంత్రి మేరుగ నాగార్జున సందర్శించారు.పట్టు వస్త్రాలు, తలంబ్రాలను తలపై పెట్టుకుని స్వామికి సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబెన్, వైస్ ఎంపీపీ ఆళ్ల వెంకట రమణారెడ్డి, చుండూరు, వేటపాలెం ఎంపీటీసీ సభ్యులు గొర్రెపాటి శ్రీనివాసరెడ్డి, సర్పంచులు ఉయ్యూరి అప్పిరెడ్డి, ఏసోబు, మాజీ సర్పంచ్ కంఠమనేని శ్రీనివాసరావు, ఈమని వెంకటేశ్వర రెడ్డి, రామాంజనేయులు, తహసీల్దార్ బి. కనక దుర్గ, ఈవోపీఆర్డీ జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తుమ్మకోటలో అలుముకున్న విషాదఛాయలు

- దైవదర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు
- సత్రశాలకు వెళ్తూ ప్రమాదంలో ఇద్దరు మృతి..



షేక్ కారంపూడి లాల్ సాహెబ్ మృతదేహం



కారంపూడి నన్నె సాహెబ్ మృతదేహం

రెంటచింతల: సత్రశాల శివయ్యను దర్శించుకునేందుకు వెళ్లిన తుమ్మకోట గ్రామానికి చెందిన ఇద్దరు ప్రమాదానికి గురై చికిత్స కోసం తరలిస్తుండగా మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తుమ్మకోట గ్రామానికి చెందిన 25 మంది భక్తులు ట్రాక్టర్‌లో సత్రశాల శివయ్య దర్శనానికి వస్తుండగా మార్గం మధ్యలో పశర్లపాడు గ్రామ సమీపంలో ట్రాక్టర్ ట్రక్ డోర్ తెరుచుకుంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న షేక్ కారంపూడి నన్నె సాహెబ్(65), షేక్ కారంపూడి లాల్ సాహెబ్(39) ఇద్దరు తారురోడ్డుపై పడడంతో గాయపడ్డారు. వీరిని వెంటనే ఓ ప్రైవేటు వాహనంలో గుంటూరు జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా పిడుగురాళ్ల సమీపంలో నన్నెసాహెబ్, గుంటూరు చేరేలోగా లాల్ సాహెబ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నన్నెసాహెబ్ వైఎస్సార్ సీపీ సీనియర్ మైనార్టీ నాయకులుగా పేరు పొందారు. ఆయనకు భార్య షేక్ సయ్యద్‌బి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలీ లాల్ సాహెబ్‌కు భార్య షేక్ ఉసేన్‌బి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సయ్యద్ షమీర్‌బాష తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్ల కేసులో ఇద్దరి అరెస్టు

పామర్రు: నకిలీ డాక్యుమెంట్లతో దొంగ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన వ్యక్తుల్లో ప్రధాన నిందితులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు పామర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కృష్ణా జిల్లా పామర్రు గ్రామంలో మాజీ జడ్జి, మాజీ ఎమ్మెల్యే తమ్మా కోటమ్మరెడ్డి ద్వారా ఆమె కుమారుడు వినోద్‌రెడ్డికి విజయవాడ రోడ్డులోని మూల మలుపుల వద్ద బ్యాంక్ కాలనీలోని 44 సెంట్ల స్థలం వారసత్వంగా వచ్చింది. దాన్ని నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ జరిగింది. ఘటనలో ప్రధాన నిందితులైన మచిలీపట్నానికి చెందిన ఎండీ ఆలీ, అతని భార్య షేక్ అస్మత్ ఉన్నీసాలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని నిపామర్రు సీఐ వెల్లడించారు. ఈ కేసులో మరి కొందరికి సంబంధాలు ఉన్నాయని సమాచారం అందిందని తెలిపారు. దీనిపై విచారణ చేస్తామని వివరించారు. సమావేశంలో ఎస్‌ఐ అవినాష్ పాల్గొన్నారు.

కనుల పండువగా జగజ్జ్యోతి



జగజ్జ్యోతిని వెలిగిస్తున్న అనువంశిక ధర్మకర్త పద్మనాభప్రసాద్, రాజవంశీకులు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో జగజ్జ్యోతి కార్యక్రమం శనివారం రాత్రి కన్నులపండువగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రమిదలో ఆలయ అనువంశిక ధర్మకర్త యార్లగడ్డ పద్మనాభప్రసాద్, చల్లపల్లి రాజ వంశీకులు జగజ్జ్యోతిని వెలిగించారు. ఆలయ ఏసీ ఎస్ సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు శంకరమంచి భాస్కర విజయకుమార్, బుద్దు నాగవరప్రసాద్ బ్రహ్మత్వంలో శనివారం తెల్లవారుజాము 2 గంటలకు శ్రీస్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్లకు సహస్ర నామార్చనలు నిర్వహించి తెల్లవారుజాము నుంచే స్వామివారి, అమ్మవార్ల దర్శనం భక్తులకు కల్పించారు. రాత్రి 7 గంటలకు కన్నులపండువగా జగజ్జ్యోతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు జగజ్జ్యోతిని దర్శించుకుని స్వామివార్లకు పూజలు చేశారు. ఆలయ అధికారులు గుమ్మడి వెంకటేశ్వరరావు, చెన్నకేశవ, వెంకటరమణ పర్యవేక్షించారు.

తీరంలో భక్తుల సందడి

కృష్ణా తీరం మహాశివరాత్రి భక్తుల రాకలతో కనులపండువగా కనిపించింది. పర్వదినం శనివారం రావడం, అందునా త్రయోదశి ఘడియలు ఉండటంతో ఉదయమే తీరానికి చేరుకుని స్నానాలు చేశారు. ఇంకొందరు తర్పణలు, పిండ ప్రదానాలు నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నాగాభరణుడికి జలాభిషేకం..



నదిలో సూర్యనమస్కారం చేస్తున్న యువతి



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



తాడేపల్లి పరిసరాల్లో కనిపించిన సందడి

క్లుప్తంగా

వైవీ రావు మృతి తీరని లోటు



బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఆర్టీసీ కార్మిక నేత వైవీ రావు మృతి తీరని లోటని ఆర్టీసీ ఎండీ ద్వారాక తిరుమలరావు అన్నారు. శుక్రవారం రాత్రి హఠాన్మరణం చెందిన వైవీ రావు కుటుంబాన్ని శనివారం ఎండీ పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ద్వారక తిరుమలరావు మాట్లాడుతూ.. అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వ్యక్తి వైవీ అన్నారు. కార్మికుల సమస్యల పట్ల ఏమాత్రం రాజీ పడే వారు కాదన్నారు. సంస్థ ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత కూడా ఉద్యోగులకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేశారన్నారు. అనంతరం వైవీ రావు అంతిమయాత్రలో పాల్గొని పాడి మోశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఖాతాదారుల సౌకర్యార్థం విస్తృత సేవలు



చెరుకుపల్లి: ఖాతాదారుల సౌకర్యార్థం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విస్తృత సేవాల్ని అందిస్తోందని, వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ నారాయణశర్మ సూచించారు. మండలంలోని కావూరు రైతు భరోసా కేంద్రం ఆవరణలో శనివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆరుంబాక శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారులకు రాత్రి శిబిర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణశర్మ మాట్లాడుతూ ఆరుంబాక బ్రాంచి ద్వారా ఒక్క కావూరు గ్రామంలోనే స్వయం సహాయక సంఘాలకు ఇప్పటిదాకా రూ. 10కోట్లతో పాటు వివిధ రుణాల్ని కూడా మంజూరు చేశామని చెప్పారు. ఆరుంబాక బ్రాంచి మేనేజర్ ఎస్. సత్యవతి మాట్లాడుతూ గ్రామంలో మొండి బాకీలు పెద్దగా లేవని, ఖాతాదారులంతా సక్రమంగా సకాలంలో చెల్లించి రుణాలు పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటి, రీజినల్ మేనేజర్ సర్వశ్రీ ప్రసాద్, సర్పంచ్ చెల్లి జ్యోతి పాల్గొన్నారు.

కమనీయం... ముక్తేశ్వరుని కళ్యాణం




రేపల్లె రూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మోర్తోటలో గల ముక్తేశ్వరస్వామి ఆలయంలో శనివారం వేడుకల్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామికి అభిషేకాలు జరిపారు. ముక్తేశ్వరస్వామి, పార్వతీ అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి రాత్రి ఆలయ ఆవరణలో వేదమంత్రాలు, మేళతాళాల నడుమ కల్యాణాన్ని అర్చకుడు సురేష్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు అన్న సంతర్పణ చేశారు. ఆలయ ఈవో నల్లవరపు నాగయ్య, సర్పంచ్ కాసాని కృష్ణకుమారి, ఆలయ చైర్మన్ రాజా మాణిక్యారావు బహదూర్, ఆలయ కమిటీ సభ్యులు పద్మజ, రాంబాబు, వెంకటేశ్వరరావు, కృష్ణకుమారి, శ్రీనివాసరావు, ఏకాంబరేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. దుర్గమ్మ సన్నిధిలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి దివ్య లీలా కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత రాజగోపురం ఎదుట మృత్తికా లింగాభిషేకాలు నిర్వహించారు. అభిషేకంలో ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు కుటుంబ సమేతంగా, ఆలయ ఈవో భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమ, వైదిక కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి, కోట ప్రసాద్ గణపతి పూజ చేసి అనంతరం స్వామి వారికి పంచామృతాలు, విభూది, జలాలతో అభిషేకించారు. అనంతరం వేదికపై శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆదిదంపతులకు చైర్మన్ రాంబాబు దంపతులు, ఆలయ ఈవో భ్రమరాంబ తలంబ్రాలను సమర్పించారు. ఉభయదాతలు, భక్తులతో పాటు దేవస్థానానికి చెందిన ఏఈవోలు, సూపరిండింటెంట్లు, ఇతర సిబ్బంది కుటుంబ సమేతంగా కల్యాణోత్సవాన్ని వీక్షించారు.

సాహితీ సౌరభాలు నిండుగా.. పుస్తకాల పండగ

- నేటితో ముగియనున్న విజయవాడ పుస్తక మహోత్సవం
- పుస్తకాల ఆవిష్కరణలకు హాజరైన ప్రముఖ సాహితీవేత్తలు
- నిత్యం ప్రముఖ సాహితీవేత్తల శతజయంతి సభల నిర్వహణ



పుస్తకాలను పరిశీలిస్తున్న సాహితి ప్రియులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి జరిగిన 33వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆదివారంతో ముగియనుంది. ఈ పుస్తక మహోత్సవం సాహితీ సౌరభాలను వెదజల్లింది. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 220కు పైగా ప్రచురణ కర్తలు, ప్రచురణ సంస్థలు, వివిధ ప్రభుత్వ సంస్థల పుస్తకాలు ఈ మహోత్సవంలో కొలువుదీరాయి. విజయవాడ నగరంతోపాటు పాటుగా ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలు, తెలంగాణలోని ఖమ్మం జిల్లాలకు చెందిన పాఠకులు, పుస్తకప్రియులు వేలాదిగా తరలివచ్చి తమకు కావాల్సిన గ్రంథాలను కొనుగోలు చేశారు. ప్రముఖుల శతజయంతి, సంస్మరణ సభలను బుక్ ఫెస్టివల్ సొసైటీ ఘనంగా నిర్వహించింది. పలువురు ప్రచురణకర్తలు, రచయితలు తమ పుస్తకాలను పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆవిష్కరించారు. నాలుగు నుంచి ఐదు లక్షల మంది పుస్తక మహోత్సవాన్ని సందర్శించారని నిర్వాహకులు అంచనా వేశారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో అతి పెద్ద పుస్తక మహోత్సవంగా ప్రసిద్ధిచెందిన విజయవాడ పుస్తక మహోత్సవాన్ని సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్ వంటి సంస్థలు గుర్తించి తమ సేవలను కూడా అందించాయి. సొసైటీ ఈ ఏడాది విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలను నిర్వహించింది.

హాజరైన ప్రముఖులు

ఈ ఏడాది పుస్తక మహోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ ఈ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది పలువురు ప్రముఖ సాహితీవేత్తలు ఈ పుస్తక మహోత్సవానికి హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అంతేకాకుండా సమకాలీన వ్యవస్థలో తెలుగు సాహిత్యానికి సంబంధించి వివిధ ప్రక్రియలపై వారు ప్రసంగించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వాడ్రేవు చిన్నవీరభద్రుడుతో పాటు ఎందరో తెలుగు నాట సాహిత్యానికి అండగా నిలిచిన సాహితీమూర్తులు హాజరయ్యారు. వామపక్షాలకు చెందిన రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, సీపీఎం జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి, పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నేతలు, పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ పుస్తక మహోత్సవంలో పాల్గొన్నారు.

భాగస్వాములైన ప్రభుత్వ సంస్థలు

గతంతో పోల్చి చూస్తే ఈ ఏడాది పలు ప్రభుత్వ సంస్థలు పుస్తక మహోత్సవంలో భాగస్వాములయ్యాయి. ముఖ్యంగా విద్యాశాఖతో పాటుగా పలు శాఖలు పాల్గొనటమే కాకుండా ఆర్థిక సాయాన్ని సైతం అందించాయి. అలాగే పలు సాంస్కృతికాంశాలను కూడా ప్రదర్శించేందుకు బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఏర్పాట్లు చేసింది. పలు ప్రభుత్వ శాఖలు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వారికి సంబంధించిన పథకాలు, కార్యక్రమాలపై పాఠకులకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశాయి.

పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): మహా శివరాత్రి పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తజనంతో కృష్ణానది తీరంలోని స్నానఘాట్లు కిటకిటలాడాయి. దుర్గాఘాట్ తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలకు తరలి వచ్చారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దుర్గాఘాట్ వరకు భక్తులు బారులు తీరి కనిపించారు. స్నానఘాట్‌లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దుర్గగుడి అధికారులు మైక్ ప్రచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున ఆరు గంటల నుంచి పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల సంఖ్య మరింత పెరిగింది. దీంతో స్నానఘాట్‌లోకి భక్తులను పరిమిత సంఖ్యలో అనుమతిస్తూ రద్దీని నియంత్రించారు. మరో వైపున స్నానఘాట్ ప్రధాన గేటు నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండేందుకు కంపార్టుమెంట్ పద్ధతిని పోలీసులు అనుసరించారు. పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. వీఐపీ ఘాట్, పున్నమి ఘాట్, నదీతీర ప్రాంతాల్లో పిండప్రదానాలు, బంగన్న దొరల సందడి కనిపించింది. పలువురు ప్రముఖులు, నగర వాసులు పితృదేవతలకు పిండప్రదానం చేశారు.

గాంధీ సిద్ధాంతాలు సమాజానికి అవసరం

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్



పుస్తకాలను ఆసక్తిగా తిలకిస్తున్న యువత



విజయవాడ పుస్తక మహోత్సవంలో గాంధీజీ హంతకుడు గాడ్సే అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు దొక్కా మాణిక్య వరప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గాంధీ సిద్ధాంతాలు నేటి సమాజానికి మరింత అవసరమని ఎమ్మెల్సీ డొక్కా మణిక్యవరప్రసాద్ అన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ఆధ్వర్యాన ముద్రించిన 'హిందూత్వ పునరాగమనం', 'గాంధీజీ హంతకుడు గాడ్సే' పుస్తకాల ఆవిష్కరణ సభ విజయవాడ పుస్తక మహోత్సవంలోని గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై శనివారం రాత్రి జరిగింది. 'గాంధీజీ హంతకుడు గాడ్సే' పుస్తకాన్ని ఆవిష్కరించిన మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ అనేక సాక్ష్యాలను, న్యాయస్థానాల తీర్పులను వివరిస్తూ రచయిత ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. దేశ సమైకత్యతో గాంధీ విజయం సాధించి జాతికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చారన్నారు. ఆయన భావాలను గాడ్సే వంటి వ్యక్తులు వ్యతిరేకించి విద్వేషాన్ని పెంచుకున్నారని వివరించారు. అందుకే గాడ్సే.. గాంధీజీని హత్య చేశారన్నారు. 'హిందూత్వ పునరాగమనం' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో హిందువులు, ముస్లింల సమైక్యతను నాటి ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. దీని తర్వాత దేశంలో ప్రజల మధ్య చీలికలను తెచ్చే ప్రయత్నంలో భాగంగా అనేక ప్రయత్నాలు చేసిందన్నారు. బ్రిటిష్ పాలకులు దేశ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేశారన్నారు. దేశాన్ని రక్షించుకునేందుకు మతతత్వ శక్తులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో పుస్తక అనువాదకురాలు ఉషారాణి, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ప్రజాశక్తి సీజీఎం అచ్యుత్‌రావు, సీనియర్ పాత్రికేయులు ఎస్.వెంకట్రావు తదితరులు ప్రసంగించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు బి.తులసీదాస్ అధ్యక్షత వహించారు.



పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలోని పుస్తక మహోత్సవంలో స్టాళ్ల వద్ద పుస్తక ప్రియుల సందడి

ప్రపంచవ్యాప్తంగా ప్రమాదంలో మాతృభాషలు

ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో మాతృభాషలు ప్రమాదంలో ఉన్నాయని పంజాబ్ విశ్వవిద్యాలయం భాషా శాస్త్ర ఆచార్యులు ఆచార్య జోగాసింహ్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యాన 'నూతన జాతీయ విద్యావిధానం – మాతృభాషలు ' అంశంపై సదస్సును శనివారం రాత్రి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యునెస్కో ప్రపంచ వ్యాప్తంగా చేసిన సర్వేలో మాతృభాషలకు ప్రజలు దూరమవుతున్నారని చెప్పారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య, భారతీయ భాషల సంఘం జాతీయ అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నూతన జాతీయ విధానంలో అనేక అంశాలు మాతృభాషను ప్రభావితం చేసేలా ఉన్నాయన్నారు. మాతృభాష తెలుగును రక్షించుకుందామన్నారు. అమ్మనుడి మాసపత్రిక సంపాదకులు సామాల రమేష్‌బాబు తదితరులు ప్రసంగించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ కనకదుర్గా నృత్య మందిర్‌కు చెందిన ఎంఎన్ఎస్.భార్గవి, జె.కనిష్క, బి.నయోనిక, పి.జ్ఞానసమన్విత, డి.ఉన్మేష, కె.కావ్యలతో పాటు మరి కొంత మంది తమ నృత్య ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.



కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

నేడు కెనాల్‌రోడ్డులో రథోత్సవం

153 ఏళ్లుగా నిర్వహణ



కనులపండువగా రథోత్సవం (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జరిగే మల్లేశ్వరుని రథోత్సవం నగరానికి తలమానికంగా నిలుస్తోంది. కేవలం నగర వాసులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలివస్తుంటారు. ఈ రథోత్సవంలో మూడు ఆలయాలకు చెందిన ఉత్సవ మూర్తులు కెనాల్ రోడ్డులో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తుంటారు. దుర్గగుడి, పాత శివాలయం బుద్ధువారి గుడిలకు చెందిన ఉత్సవమూర్తులను ఈ రథంపై అధిష్టింపజేస్తారు. శ్రీకన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ గడిచిన 153 సంవత్సరాలుగా ఈ రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వన్‌టౌన్ రహదారులన్ని జాతరను తలపించే విధంగా దుకాణాలతో దర్శనమిస్తాయి. ప్రధానంగా గ్రామాల్లో జరిగే తిరునాళ్ల, సంత వాతావరణాన్ని ఈ రథోత్సవం ఆవిష్కరిస్తుంది. ఈ ఏడాది మరింత దేదీప్యమానంగా రథోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు.

కెనాల్‌రోడ్డులో భక్తులకు కనువిందు..

దుర్గగుడి, బుద్ధు వారి గుడి, పాతశివాలయానికి పూర్వం ఆర్థిక వనరులు ఉండేవి కావు. ఆ సమయంలో శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేవారు. ఆ తరువాత ఈ మూడు ఆలయాలకు సంబంధించిన ఉత్సవ మూర్తులతో రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆ కమిటీ ప్రముఖులు చెబుతున్నారు. అయితే నేడు దుర్గగుడికి ఆదాయ వనరులు పెరగటంతో మూడున్నర దశాబ్దాలుగా దుర్గగుడి అధికారులే కొండపైన కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. అయితే పాతశివాలయంలో ఇప్పటికీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలోనే కల్యాణోత్సవాలు కొనసాగుతున్నాయి. రథోత్సవంలో మాత్రం మూడు ఆలయాల ఉత్సవమూర్తులు ఊరేగుతున్నాయి. కెనాల్‌రోడ్డులోని రథం సెంటర్ నుంచి ఆదివారం రథోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ కమిషనరేట్ పోలీసు కమిషనర్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించడం కూడా రెండు దశాబ్దాలుగా కొనసాగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే పలు జానపద కళాకారుల విన్యాసాలతో, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఆదిదంపతులు కృష్ణానది ఒడ్డున ఉన్న కెనాల్‌రోడ్డులో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేయనున్నారు.



త్రికోటేశ్వరుడిని దర్శించుకునేందుకు వచ్చిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దంపతులు



కలెక్టర్ శివశంకర్ కుటుంబ సభ్యులు..



త్రికోటేశ్వరుని సన్నిధిలో మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ డొక్కా మణిక్యవరప్రసాద్



స్వామి సన్నిధిలో మంత్రి కొట్టు సత్యనారాయణ

• హరహర మహాదేవ..


హరహర మహాదేవ.. శంభో శంకర నినాదాలతో త్రికోటేశ్వరుని సన్నిధి మార్మోగింది. కోటప్పకొండపై ఉన్న కోటయ్యను దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. భారీ ప్రభలు తరలివచ్చాయి. అడుగుగడుగునా త్రికోటేశ్వరుని మొక్కులు చెల్లించారు.



త్రికోటేశ్వరుడిని సన్నిధిలో మాచర్ల ఎమ్మెల్యే పి.రామకృష్ణారెడ్డి(పీఆర్కే) కుటుంబ సభ్యులు




త్రికోటేశ్వరుడిని సన్నిధిలో ఐజీ త్రివిక్రమవర్మ



భారీగా తరలివస్తున్న భక్తులు



ప్రభలతో తరలివస్తున్న చిన్నారులు



కోటప్పకొండ చేరుకున్న భారీ విద్యుత్ ప్రభ

సాక్షి గుంటూరు

ఆదివారం। 19। ఫిబ్రవరి। 2023



త్రికోటేశ్వరుని సేవలో న్యాయమూర్తి


నరసరావుపేటరూరల్: హైకోర్టు న్యాయమూర్తి సుజాత త్రికోటేశ్వర స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.9148 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ సుస్మితారెడ్డి దంపతులకు అర్చకస్వాములు, అధికారులు స్వాగతం పలికారు. అతిథిగృహంలో అర్చక స్వాములు సంప్రదాయబద్ధంగా తలపాగా చుట్టారు. వేదమంత్రోచ్చారణలు, మేళతాళాలతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, వెండి ప్రభను తలపై ఉంచుకొని గొల్లభామ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామి వారికి పట్టువస్త్రాలు, వెండిప్రభను అందజేశారు. వీరి వెంట జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ దంపతులు, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు ఉన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ చంద్రకుమార్, డెప్యూటీ కమిషనర్ వేమన చంద్రశేఖరరెడ్డి, ఈవో వేమూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 555.40 అడుగుల వద్ద ఉంది. ఇది 221.8332 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,120, ఎడమకాలువకు 8,896, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 21,626 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 21,626 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 829.90 అడుగుల వద్ద ఉంది. ఇది 49.4063 టీఎంసీలకు సమానం.

21న మాతృభాష సేవా శిరోమణి అవార్డుల ప్రదానం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న వివిధ రాష్ట్రాలకు చెందిన భాషా కోవిదులను ఘనంగా సన్మానించనున్నట్లు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. విజయవాడ గవర్నర్‌పేటలోని హోటల్ పార్క్, ఐరిస్ ప్రైమ్‌లో ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్.కృష్ణంరాజుతో కలిసి ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వివిధ రాష్ట్రాలకు చెందిన భాషా కోవిదులు, కళాకారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారందరినీ 'మాతృభాష సేవా శిరోమణి' అవార్డులతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సత్కరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా భాషల్లో రచించిన పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కృష్ణంరాజు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఈ నెల 21న 'నేటి తరానికి ఆంగ్ల బాషా మాధ్యమం ఆవశ్యకత' అంశంపై వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 81253 44441 సెల్ నంబర్లో సంప్రదించాలని కోరారు.



కోటప్పకొండ ప్రాంగణంలో భక్తుల రద్దీ



క్వారీ బాలకోటేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం




గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి పోటెత్తిన భక్తులు

దివ్యోత్సవం.. శివోత్సవం

- శైవక్షేత్రాల్లో వైభవంగా మహా శివరాత్రి వేడుకలు
- కాంతులీనిన భారీ విద్యుత్ ప్రభలు
- భక్తులతో కిక్కిరిసిన శివయ్య కోవెలలు



సత్రశాలలో స్వామివారిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు



కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో మహా శివరాత్రి తిరునాళ్లలో వెలుగులు విరజిమ్ముతున్న విద్యుత్ ప్రభలు



భక్తుల పూజలందుకుంటున్న అమరేశ్వరుడు



పెదకాకాని శివాలయం ప్రాంగణంలో భక్తుల రద్దీ



సీతానగరం ఘాట్‌లో భక్తజనం

కోరినంతనే కోర్కెలు తీర్చే భక్తవల్లభుడు.. భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న భోళా శంకరుడి క్షేత్రాలు మహాశివరాత్రికి శోభిల్లాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని ప్రముఖ శైవక్షేత్రాలు, ఆలయాలు శివరాత్రి వేడుకలతో ఆధ్యాత్మిక జ్యోతులు వెదజల్లాయి. కోటప్పకొండపై కొలువుదీరిన త్రికోటేశ్వరస్వామి సన్నిధి శివనామ స్మరణతో మారుమోగింది. మహాశివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు శనివారం కొండపై కోటయ్యను దర్శించుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు స్వామి సన్నిధికి చేరుకోవడంతో కోటప్పకొండ భక్తజనసంద్రంగా మారింది. పంచారామ క్షేత్రాల్లో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. వేలాదిగా భక్తులు అమరేశ్వరుడి దర్శనం చేసుకున్నారు. ముందుగా భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమరేశ్వరాలయంలో దీపారాధన నిర్వహించారు. రెంటచింతల మండలంలోని సత్రశాలలో కొలువైన గంగా భ్రమరాంబ సమేత మల్లన్న దర్శనానికి భక్తజనులు పోటెత్తారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని శివక్షేత్రంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఓం నమఃశివాయ నామం మార్మోగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. మంగళగిరి-తాడేపల్లి పరిధిలోని సీతానగరం ఘాట్‌తో పాటు ఉండవల్లి కరకట్ట వెంబడి కృష్ణా నదిలో వేలాదిగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆయా ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమర్తలూరు మండలం గోవాడలోని బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ట్రాక్టర్లు, ఎద్దులబండ్లపై దైవ దర్శనం కోసం తరలివచ్చారు. ప్రభలతో దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చుండూరులోని బాలత్రిపురసుందరీదేవి సమేత బాలకోటయ్యస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. హరహర మహాదేవ.. శంభోశంకర.. అంటూ చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామిని సుమారు లక్ష మంది భక్తులు దర్శించుకున్నారు. విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఎస్పీలు వివిధ శైవ క్షేత్రాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్

శరవేగంగా రీ-సర్వే

- మేడికొండూరు, వట్టిచెరుకూరు మండలాల్లో పూర్తి
- డిసెంబర్‌లోగా అన్ని గ్రామాల్లో..
- జిల్లాలో 173 గ్రామాల్లో రీ-సర్వే
- ఇప్పటికే 93 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి
- 23 గ్రామాల్లో మ్యాపింగ్ పూర్తి
- జిల్లాలో 5,95,388 ఎకరాల్లో కొలతలు
- వందేళ్ల తర్వాత ఇదే ప్రథమం



సర్వే కోసం వినియోగిస్తున్న డ్రోన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద రీ-సర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి జిల్లా మొత్తం రీ-సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందుల కారణంగా కొంత జాప్యం జరుగుతోంది. ఎప్పుడో 1905లో బ్రిటీషర్లు చేపట్టిన తర్వాత 2020 వరకు మరే నాయకుడు దీనిజోలికి వెళ్లే ధైర్యం చేయలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రీ-సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. దీనిద్వారా ప్రతి అంగుళం భూమి మ్యాపింగ్‌లోకి తీసుకురావడంతో పాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చే దిశగా ఈ ప్రక్రియ జిల్లాలో 2020 డిసెంబర్‌లో ప్రారంభమైంది. తొలుత పైలెట్ ప్రాజెక్ట్ కింద దుగ్గిరాల మండలంలోని దేవరాపల్లి అగ్రహారం, ప్రత్తిపాడు మండలంలోని కొండజాగర్లమూడి, వేమూరు మండలంలోని పులిచింతలపాలెం, యడ్లపాడు మండలంలోని మద్రిపాలెం, దాచేపల్లి మండలంలోని అలుగుమల్లిపాడును ఎంపిక చేశారు. అక్కడ విజయవంతంగా పూర్తిచేశారు. ఇప్పటి వరకూ 2,220 ఎకరాలకు గాను 1615 మందికి భూమి హక్కు పత్రాలను అందజేశారు. మరో 325 సిద్ధంగా ఉన్నాయి.

ఉపయోగాలు ఇవీ..

రీ-సర్వే అనంతరం సంబంధిత భూమి, స్థలం యజమానికి ప్రింటెడ్ పాస్‌బుక్ ఉచితంగా ఇస్తారు. భూహద్దు, దస్తావేజు సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. చట్టబద్ధత ఏర్పడుతుంది. గ్రామాల్లో భూ కబ్జాలు, వివాదాలకు స్వస్తి పడుతుంది. ఎటువంటి దస్తావేజులు లేకపోయినా ఇళ్లు నిర్మించుకుని ఎంతో కాలం నుంచి నివాసముంటున్న వారికి సర్వే పట్టా అందజేస్తారు. అమ్మకాలు, కొనుగోళ్లు పారదర్శకంగా జరుగుతాయి. ఎంతటి ప్రజాప్రతినిధి అయినా, పెద్ద మనుషులు అయినా ప్రభుత్వ భూమిలో అడుగుపెట్టకుండా ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. రీ-సర్వే తర్వాత ఇచ్చే పట్టాలు, పాస్‌బుక్స్‌తో రుణాలు పొందవచ్చు.

93 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

గుంటూరు జిల్లాలో మొత్తం 223 గ్రామాలు ఉండగా, గుంటూరు డివిజన్‌లో 119, తెనాలి డివిజన్‌లో 104 గ్రామాలు ఉన్నాయి. సీఆర్‌డీఏ పరిధిలోని 20 గ్రామాలు, మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాలుగు గ్రామాలు, 26 అర్బన్ గ్రామాల్లో ప్రస్తుతం సర్వే నిర్వహించడం లేదు. ఇప్పటికి ఐదు పైలెట్ గ్రామాల్లో సర్వే పూర్తయింది. 47 గ్రామాల్లో సర్వే ఆఫ్ ఇండియాకు, 121 గ్రామాల్లో యుక్రా అనే సంస్థకు రీసర్వే బాధ్యతలు అప్పగించారు. సర్వే ఆఫ్ ఇండియాకు అప్పగించిన 47 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేసింది. యుక్రా సంస్థ 46 గ్రామాల్లో డ్రోన్‌ను తిప్పింది. మొత్తం 93 గ్రామాల్లో డ్రోన్‌ను తిప్పి ఏరియల్ వ్యూ మ్యాపింగ్ పూర్తి చేశారు. 23 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్)ను జారీ చేశారు. వీటిని క్షేత్రస్థాయి భూమితో పోల్చి నిజనిర్ధారణ (గ్రౌండ్ ట్రూతింగ్) చేసే ప్రక్రియ 22 గ్రామాల్లో పూర్తయింది. అయితే రికార్డుల్లో ఉన్న భూమికి క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి పొంతన లేకపోవడం వల్ల సర్వే పూర్తి చేయడంలో కొంత మేర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదాహరణకు రికార్డుల్లో ఎకరం ఉంటే వాస్తవంగా క్షేత్రస్థాయిలో 80 సెంట్లు, 90 సెంట్లో భూమి ఉంటోంది. దీంతో ఆ భూ యజమానికి చుట్టుపక్కల ఉన్న భూముల యజమానులకు కూడా నోటీసులు ఇచ్చి అందరి సమక్షంలో వాటిని మళ్లీ కొలవాల్సి వస్తోంది. మరోవైపు భూ యజమానులు స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల కూడా కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. మూడు వేల ఎకరాల భూమి ఉన్న ఒక గ్రామం సర్వేను పూర్తిస్థాయిలో చేయడానికి నాలుగు నుంచి ఐదు నెలల సమయం పడుతోంది. అయినా ప్రభుత్వం దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.

లక్ష్యానికి అనుగుణంగా సర్వే



జిల్లాలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద నిర్వహిస్తున్న రీ-సర్వే వేగంగా జరుగుతోంది. ఇప్పటికి 93 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయింది. మరోసారి డ్రోన్ వస్తే మిగిలినవి కూడా పూర్తి చేస్తాం. గ్రామాల్లోకి అధికారులు వచ్చేటప్పుడు రైతులు అందుబాటులో ఉండి సహకరిస్తే పని త్వరగా పూర్తవుతుంది. సివిల్, క్రిమినల్ వివాదాలకు స్వస్తి పలకడం ద్వారా గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణం వచ్చేలా చేయవచ్చు.

– జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్

నేడు ఎస్ఐ పోస్టుల ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలు, 14,791 మంది అభ్యర్థులు
- పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు

నగరంపాలెం(గుంటూరు): ఏపీ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టుల భర్తీకి జిల్లాలో నిర్వహించనున్న ప్రిలిమినరీ పరీక్షలకు కేంద్రాలు సిద్ధమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14,791 మంది అభ్యర్థులకు 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించనున్నారు. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించే ప్రసక్తిలేదని అధికారులు ప్రకటించారు. అభ్యర్థులు ముందుగానే కేంద్రాల వద్దకు రావాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు, ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అభ్యర్థులు హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, నలుపు/బ్లూ పెన్‌లను మాత్రమే లోనికి అనుమతించనున్నారు. తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ దుకాణాల మూసివేతతో పాటు, కేంద్రాల వద్ద గుంపులుగా లేకుండా చర్యలు తీసుకోనున్నారు.

సత్తా చాటిన నంద్యాల జిల్లా ఎడ్ల జతలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంబాబు

